

## దళిత రైతు ఆత్మహత్యాయత్నం

నూతనకల్, నవంబర్ 15 : వరి కోతల వేళ సొంత పొలానికి వెళ్లేందుకు కొందరు కోతల యంత్రానికి దారి ఇవ్వడం లేదని మనస్తాపం చెందిన దళిత రైతు ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం చిల్పకుంట్లలో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. చిల్పకుంట్ల గ్రామానికి చెందిన ఏషమల్ల వెంకన్నకు సుమారు 5 ఎకరాల పొలం ఉన్నది. ఐదేండ్ల నుంచి వరి కోత కోయించే సమయంలో వరి కోత మెషిన్ వెళ్లకుండా ఉన్నత వర్గాలకు చెందిన వారు కొందరు అడ్డుపతున్నారు. దీంతో మనస్తాపానికి గురైన వెంకన్న గురువారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా సూర్యాపేటలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. వెంకన్న పరిస్థితి విషమంగా ఉన్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. దళిత ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న తుంగతుర్తి నియోజక వర్గంలోనే దళిత రైతు వేధింపులకు గురికావడం గమనార్హం.

# ఆర్‌ఎస్ బ్రదర్స్‌ది ఫెవికాల్ బంధం

- రేవంత్, సంజయ్ ఒక్కటై బీఆర్‌ఎస్‌పై బురదజల్లుతున్నరు
- బండికి నెట్, వర్క్, వర్త్ లేదు
- లగచర్ల నందిగ్రామ్‌లా మారుతున్నది
- ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆగ్రహం
- లగచర్ల తండాల్లో రజాకార్ల పాలన
- తిరుపతిరెడ్డికి ఏ హోదాలో ఎస్కార్ట్ ఇచ్చారు?
- కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానందగౌడ్. చిత్రంలో ఎర్రోళ్ల శ్రీనివాస్

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ (ఆర్‌ఎస్) బ్రదర్స్ బంధం ఫెవికాల్ బంధంలా మరింత గట్టిగా మారిందని బీఆర్‌ఎస్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్ విమర్శించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ సీఎం రేవంత్‌రెడ్డికి సహాయ మంత్రిగా మారారని ఎద్దేవా చేశారు. లగచర్లలో గిరిజన రైతులను అక్రమంగా అరెస్టుచేసి చిత్రహింసలకు గురిచేసిన ఘటనపై సంజయ్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. సొంత పార్టీ ఎంపీ డీకే అరుణను లగచర్ల గ్రామానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకుంటే, సంజయ్ ఎందుకు మాట్లాడలేదు? లగచర్లలో గిరిజన రైతులను అరెస్టు చేస్తే ఏం చేస్తున్నారు? అని నిలదీశారు. కేసీఆర్ నాయకత్వాన్ని బలహీనపర్చాలనే ఉద్దేశంతో ఆయన కుటుంబంపై కాంగ్రెస్, బీజేపీ నేతలు బురదచల్లుతున్నారని మండిపడ్డారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆటవిక పాలన సాగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటయ్యాయని, రేవంత్, సంజయ్ ఆర్‌ఎస్ బ్రదర్స్‌లాగా పని చేస్తున్నారని విమర్శించారు. కొడంగల్ అగ్నిగుండంగా మారితే సంజయ్ ఎక్కడ నిద్రపోయారని నిలదీశారు. కేటీఆర్ బావమరిది గృహప్రవేశ ఘటనపై తనకు నెట్‌వర్క్ ఉన్నదంటూ తక్షణమే స్పందించిన సంజయ్‌కి నెట్‌లేదు, వర్క్‌లేదు, వర్త్ లేదు అని ఎద్దేవాచేశారు. కేటీఆర్‌ను వ్యక్తిగతంగా రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ అగ్నిగుండంలా మారుస్తున్నారని, పోలీసులను సీఎం తన ప్రైవేట్ సైన్యంలా వాడుకుంటున్నారని మండిపడ్డారు. లగచర్ల ఘటనకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని, పార్టీలకు అతీతంగా రైతులు తిరుగుబాటు చేశారని, అధికారులపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడిచేశారంటూ కొన్ని ఫొటోలను మీడియాకు చూపించారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని విమర్శించారు. లగచర్ల బెంగాల్‌లోని నందిగ్రామ్‌లాగా మారబోతున్నదని హెచ్చరించారు.

### 144 సెక్షన్ తిరుపతిరెడ్డికి వర్తించదా?: ఎర్రోళ్ల

కొడంగల్ నియోజకవర్గంలో 144 సెక్షన్ విధించారని, కానీ రేవంత్‌రెడ్డి అన్న తిరుపతిరెడ్డి వందల కార్లతో తిరుగుతున్నారని ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. తిరుపతిరెడ్డికి ఏహోదాలో ఎస్కార్ట్ వాహనాలు ఇస్తున్నారో సీఎస్, డీజీపీ, కలెక్టర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీ డీకే అరుణ వెళ్తే పోలీసులు వెనక్కి పంపారని, తిరుపతిరెడ్డికి ఎదురేగి పూల బోకేలను ఏ హోదాలో ఇచ్చి కలెక్టర్ స్వాగతం పలుకుతారని ప్రశ్నించారు. ఏడో గ్యారెంటీ కింద రాష్ట్రంలో రజాకార్ల పాలన నడుస్తున్నదని విమర్శించారు. రజాకార్ల నాయకుడిగా తిరుపతిరెడ్డి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

# సర్కారుకు భూములివ్వం

మొదటిపేజీ తరువాయి...

చేరుకున్నారు. సమావేశం ఎందుకు ఏర్పాటు చేశారని రైతుల నుంచి వివరాలు సేకరించారు. గొడవలు సృష్టిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులు వెళ్లిన తర్వాత రైతులు సమావేశాన్ని కొనసాగించి పలు నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిసింది. ఎట్టి పరిస్థితుల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు భూములు ఇచ్చేది లేదని తీర్మానం చేసుకున్నారని, సమష్టిగా ఉంటూ శాంతియుతంగా పోరాటం చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు విషయమై స్థానిక కాంగ్రెస్ ముఖ్య నాయకులతో మరోసారి చర్చించి, మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. ఇక్కడ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయకుండా ప్రయత్నాలు చేయాలని మంత్రిని కోరాలని రైతులు నిర్ణయించినట్టు తెలిసింది.






# అరెస్టులకు భయపడం

**లగచర్ల ఘటన బాధ్యత ప్రభుత్వానిదే • కడుపుమండిన వారంతా తిరగబడ్డారు • మాజీ ఎమ్మెల్యే దాస్యం**



మీడియాతో మాట్లాడుతున్న దాస్యం

హనుమకొండ, నవంబర్ 15: కాంగ్రెస్ నాయకుల బెదిరింపులకు, అరెస్టులకు భయపడే ప్రసక్తి లేదని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ స్పష్టంచేశారు. '11 నెలల కాంగ్రెస్ పాలనలో సంక్షేమం మాయమైంది. అభివృద్ధి దూరమైంది. తెలంగాణ ఆగమైంది' అని అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, కుడా మాజీ చైర్మన్లు మర్రి యాదవరెడ్డి, సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్‌తో కలిసి దాస్యం మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నాయకులు అనిల్ జాదవ్, సబితా ఇంద్రారెడ్డి సంగారెడ్డి జైలుకు వెళ్లి లగచర్ల రైతులను పరామర్శించగా బాధితులు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. దాడి చేశారనే నెపంతో రైతులను అరెస్ట్ జేసి, జైలుకు పంపారని మండిపడ్డారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాత్రం దాడి జరగలేదని, దాన్ని దాడి అనవద్దని ఆయనే స్వయంగా పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదని, ప్రతీకార పాలనగా మారిందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి తన నియోజకవర్గంలో లగచర్ల రైతుల భూమిని కబ్జా చేయాలని చూస్తుంటే కడుపుమండిన వారంతా తిరగబడినట్టు తెలిపారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల ప్రాంతంలో ఫార్మాసిటీకి 14 వేల ఎకరాలు సేకరించారని, ఇప్పటికే 350 ఫార్మా పరిశ్రమలు స్థాపించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. దాన్ని పక్కన పెట్టడం వెనుక రేవంత్‌రెడ్డి ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇప్పుడు కొడంగల్‌లో ఫార్మా సిటీకి భూసేకరణ జరపాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. ఫార్మా క్లస్టర్ల పేరుతో గిరిజనుల జీవితాల్లో భయం నింపారని అన్నారు. లగచర్ల ఘటనకు ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.







